# అద్దె ఇంటి కథ

వీరభద్రరావ్ పమ్మి



ఆనందరావు చిరాకుగా ఉన్నాడు. కోపంగాఅసహనంగాఉన్నాడు.

ఆనందరావుకి హైదరాబాదులో ఓచిన్న గవర్నమెంటు అఫీసులో చిన్న ఉద్యోగం వుంది.

ఆనందరావుకి సుజాతనే అమ్మాయితో పెళ్ళయింది, ఆమె అందంగానే కాకుండా ఆప్యాయంగా కూడా వుంటుంది.

పెళ్ళయిన రెండేళ్ళ తర్వాత ఆనందరావుకి ఓపిల్లాడు కలిగాడు. ఆపిల్లవాడు ముద్దుగా' బొద్దుగా వుంటాడు. తండ్రి మీదగౌరవంకొద్దీ ఆ పిల్లవాడికి సూర్యకుమార్ అని పేరు పెట్టుకున్నాడు.

ఆనందరావు అద్దె కొంపలో ఉంటూ సిటీబస్సు మీద ఆఫీసుకెళ్ళి వళ్ళు దాచుకోకుండా పని చేస్తాడు. అతను రోజూ తెలుగు పేపరు చదువుతాడు. అతనికి రాజకీయమైన నమ్మకాలేవీ లేవుగాని- ఏమూల అన్యాయాలు జరిగినా బాధ పడతాడు.

మరలాంటి 'గుడ్‌బోయ్' ఆనందరావుకి చిరాకు. కోపం అసహనం ఎందుకు కలిగాయి?

అసలు కథేమిటంటే ..

సుజాత తన పెత్తండ్రి కూతురు పెళ్ళికి వెడతానంటే ఆనందరావు వద్దనలేదు- తనని రమ్మని బలవంత పెట్టకుండా ఉంటే బావుండునని మాత్రం అనుకున్నాడు.

భర్త ఆర్థిక పరిస్థితి తెల్సున్న సుజాత అతన్ని రమ్మని బలవంత పెట్టలేదు, పెళ్ళయ్యాక అట్నుంచటు పుట్టింటికెళ్ళి పది రోజులుండి వస్తానంటే ఆనందరావు వొద్దనలేదు. ఆడవాళ్ళకి పుట్టింటిమీద మమకారం ఉండటంసహజమని మాత్రం అనుకున్నాడు.

పది రోజుల్లో వస్తానన్న పెళ్ళాం పదిహేను రోజులయినా, నెలైనా రాక

పోయేసరికి ఆనందరావుకి కోపం చిరాకు అసహనం.... కలిగాయి.
"ఏమిటో.... ఫెమిలీ లేక చాలా బోర్‌గా వుంది. పిల్లవాడు మరీ అలవాటై పోయాడు." అని స్నేహితులతో ఆనందరావు చాలా సార్లన్నాడు.
అలవాటైన పిల్లాడులేక బోర్‌గావున్న మాట వాస్తవమైనా అదొక్కటే కారణం కాదు.
పెళ్ళాం కూడా లేదు.
అలిసిపోయి ఇంటి కొచ్చేసరికి మంచి నీళ్ళిచ్చే చిన్న దిక్కులేదు వేళకి అన్నం పెట్టే పెద్ద దిక్కులేదు.
సగటు మనిషికి .. సగం జీవితంలో దొరికే ఒకే ఒక్క చిన్న ఆనందం, అనుభూతి... అనుభవం ...
అదే లేదు.
ఓ మావయ్య గారింటిలో పెళ్ళని, మరో పిన్ని గారమ్మాయి పెద్దమనిషైందని- ఏవో కారణాలుచెప్తూ తన ప్రయాణాన్ని వాయిదావేస్తున్నపుడల్లా సుజాత భర్తకి ఉత్తరం రాస్తూనే ఉంది.
ఆమెరాసే కారణాలన్నీ ఆనందరావుకి సబబుగానే అని పిస్తున్నాయి...
అయినా చిరాకు పడుతూనే ఉన్నాడు. చివరికి "ఫలానా రోజున, ఫలానా రైలుకు వస్తున్నాను, స్టేషన్‌కి రండి" అని పెళ్ళాం రాసిన ఉత్తరం వచ్చాక ఆనందరావుకి కోపం, చిరాకు, అసహనం తగ్గాయి.
ఫలానారోజున, ఫలానా టైముకి, ఫలానా రైలుకి పెళ్ళాన్ని రిసీవ్ చేసుకోడానికి అతను సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్ళాడు కిటికీలోంచి తనకోసం కళ్ళతో వెతుకుతున్న పెళ్ళాన్ని చూడగానే ఆనందరావు మొహం చాటంతయింది ఆమె కూర్చున్న కంపార్టుమెంటు దగ్గరకెళ్ళి లోపలికెక్కి గబగబా సామానుదింపాడు పిల్లాడ్ని ఎత్తుకుని తను ప్లాట్‌ఫాంమీద కొచ్చాడు. పెళ్ళాంకూడా రైలు దిగగానే సామాన్లన్నీ ఉన్నాయోలేవో చూసుకున్నాడు. రష్ తగ్గాక బైటికివెడదామని అక్కడే నుంచోమన్నాడు-
అప్పుడే ఆనందరావు సుజాత వెనకాల బేగ్ భుజానికి తగిలించుకుని నుంచున్న ఇరవైఏళ్ళ కుర్రాడిని చూసాడు. చూశాక "ఇతనెవరు? అన్నట్టుగా పెళ్ళాంకేసి చూశాడు.
ఆమె భర్త మొహంలో ప్రశ్నని గమనించింది.
"వీడు తెలియదా? మా పెద్దమామయ్య లేడూ! కాకపర్రు... ఆయన రెండో కొడుకు రామం. బిఏ పాసయి ఉద్యోగం కోసంవెతుక్కుంటున్నాడు. వీడికివెల్లుండి ఇక్కడేదో టెస్టువుందే. ప్రయాణంలో నాకు తోడు ఉంటాడు కదాని నాన్న వీణ్ని నాతో పంపాడు" అంది సుజాత.
మనసులో కలిగిన చిరాకును మనసులోనే అణగ దొక్కేసి మొహాన చిర్నగవు వెలిగించుకున్నాడు ఆనందరావు "హలో" అని రామంతో చేయికలిపాడు.
ఆనందరావు మనసులో చిరాకు కలగడానికి కారణం... రామంమీద కాని, అతని తండ్రిమీద కాని అతనికెటువంటి ద్వేషమూ, పగ, కోపమూ లేవు,
ఆనందరావుకి బంధు ప్రీతి లేకపోలేదు.
కాని ......
తను వుంటున్నది ఒక్క గదిలో...అదే

వాళ్ళకి వంటిల్లు, పడకగది, స్టోర్ రూం డయినింగ్ హాల్, డ్రాయింగ్ రూం గెస్టు రూం అన్నీ అదే....

అద్దె రెండువందల రూపాయలు.

నగరంలో బతుకుతున్న వాళ్ళు వచ్చిన జీతంలో నాలుగోవంతు ఇంటి అద్దెకే ఖర్చు చేస్తారు. అద్దె ఎక్కువని ఇల్లు మారితే- అదే గదికి ఎక్కువ పెట్టాలి'

నెలరోజులుగా భార్య వియోగం కలిగించిన మానసిక శారీరక సెగలపొగలవేడి భార్య వస్తోందని తెల్సినపుడు కలిగే ఆనందం ..

రామాన్ని చూడగానే నిరాశ కలిగింది. భార్యతో వంటరితనం మరి కొన్నాళ్ళు దొరకదు,

ఆటోలో అందర్నీ ఇంటికి చేర్చాడు. తన మనసులో కలిసిన నిరాశకు ఆనందరావు సిగ్గుపడ్డాడు.

పాపం... ఆకుర్రాడు ఉద్యోగానికి సంబంధించిన పరీక్ష ఉంటే వచ్చాడు కదా- అనుకున్నాడు ఆనందరావు.

రామం వచ్చిన రోజు, మర్నాడు పరీక్షకి చదువుకోడంలో మునిగి పోయాడు తర్వాతరోజు ఆనందరావే దగ్గరుండి పరీక్షకి తీసికెళ్ళి పూర్తయ్యేదాకా బైట కూర్చుని తిరిగి తీసుకొచ్చాడు.


రు. 75,000 విలువగల బహుమతులు గెలవండి.

| | | |
|---|---|---|
| 12 | 17 | 10 |
| 11 | 13 | 15 |
| 16 | 9 | 14 |

(మాదిరి మొత్తం ; 36)

మొదట చేరిన 5 ఎంట్రీలకి ఉచితంగా మిక్సర్ లభిస్తుంది.

బహుమతులు : టి. వి: లేక టేప్ రికార్డర్.

కన్సొలేషన్ బహుమతులు : నేషనల్ టూ ఇన్ వన్ మోడల్ ట్రాంసిస్టర్ 310/- విలువైంది 180/—లకే లభిస్తుంది. వ్యాపార అభివృద్ధి పథకం. చేరిన 10 ఎంట్రీలకి రిస్ట్‌వాచీ ఉచితంగా లభిస్తుంది.

పోస్టుకార్డుమీద 9 ఖాళీగళ్ళను మాదిరి విధంగా గీయండి. 10 నుంచి 18 దాకా అంకెలని వుపయోగిస్తూ ఎటు కూడినా 42 రావాలి. ఒక అంకె ఒకసారే వుపయోగించాలి. 15 రోజుల్లో ఎంట్రీలుచేరాలి. మొదటచేరిన 10 ఎంట్రీలకి రిస్ట్‌వాచీ బహుమానం.

| | | |
|---|---|---|
| 18 | | |
| | 14 | |
| | | 15 |

**B. S. ENTERPRISES**
**P. B. No. 9455 Delhi-110051**

మరో రెండు రోజులు మామూలుగానే గడిచిపోయాయి కాని రామం తిరిగి ఊరెళ్ళే ఉద్దేశ్యంలో కనబడలేదు. చలి కాలం మూలంగా అతనికి ఆరుబైట పక్క వెయ్యడం కుదరదు. ముగ్గురూ ఒకే గదిలో పడుకోవాల్సిన పరిస్థితి. 'నీ పరీక్ష అయిపోయిందిగా - మీ ఊరెళ్ళిపో!' అని అతనికి ఆనందరావు కాని సుజాతకాని చెప్పలేదు.

"పోనీ సిటీ అంతా తిరిగేపయ్యా! ఇక్కడ చూడాల్సినవి చాలా ఉన్నాయి" అన్నాడు ఆనందరావు రామంతో. పోనీ ఆరెండు రోజులూ శెలవు పెట్టి తను ఇంటిలో ఉండొచ్చు కదాని...

"ఏబస్ ఎక్కి ఎక్కడ దిగాలో నాకు తెలియదు కదా! సిటీ చూడాలనే వుంది" అన్నాడు రామం.

అలా అని ఊరుకోలేదు

"రెండ్రోజులు శెలవు పెట్టి నాకు సిటీ చూపించండి." అని సతాయించడం మొదలెట్టాడు.

ఆనందరావుకి మొదటిలో ఇష్టంలేక పోయినా ఆలోచించిన మీదట రామానికి సిటీ చూపిస్తేనే మంచిదన్న ఆలోచన కలిగింది. సిటీ చూపించేస్తే అతను తిరిగి తని ఊరి కెళ్ళిపోతాడు.

ఆనందరావు వెంటనే రెండురోజులు శెలవుపెట్టి తనఖర్చు మీద రామానికి ఊరంతా చూపించాడు. తర్వాతకూడా రామం ఊరెళ్ళే ప్రయత్నంలో కనబడలేదు. ఓరోజు ఉదయం రామం స్నానానికి వెళ్ళాక "ఇదెక్కడి తద్దినం? కదలడు, అసలు వాణ్నెందుకు తీసుకు వచ్చావు?" అన పెళ్ళాంమెద కసురుకున్నాడు ఆనందరావు.

రామం కదలటంలేదని ఆమెకే బాధగా ఉంది. కాని ఏం చేస్తుంది?

"ఏదో పరీక్షఅంటే సరే అనుకున్నాను. వదలకుండా ఇలా జీళ్ళ పాకంలా కూర్చుంటా డనుకున్నానా?" అంది సుజాత...

మరోరోజు గడిచింద

"రామం నువ్వు రైల్లో వెళ్ళాలంటే ముందుగా రిజర్వు చేయించుకోవాలి మరి ముందుగా ఆవిషయం చూసుకో" అన్నాడు ఆనందరావు

అరకంగానయినా అతనెప్పుడు కదులుతాడో తెలుస్తుందని...

"ఎందుకండీ బస్‌లో వెళ్ళిపోతాను. అలా అయితే అదేరోజు టికెట్ కోనుక్కోవచ్చు కదా?" అన్నాడు రామం.

ఆనందరావుకి రామం తలబద్దలుకొట్టేద్దామా అనుకున్నంత కోపం వచ్చింది. తమాయించుకున్నాడు.

రామం ఊరెళ్ళటం విషయం ఆలోచించడం మానుకున్నాడు ఆనందరావు. వేళకి భోజనంచేసి, కదలకుండా ఇంట్లోనే కాలక్షేపం చేస్తున్నాడు రామం.

అలా మరో నాలుగు రోజులు గడిచింది. ఐదో రోజు రామానికి తండ్రి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. విశాఖపట్నంలో అతనికి మరో పరీక్ష వుందని వెంటనే బయల్దేరి రమ్మని ఉత్తరం సారాంశం. ఆరోజు రామాన్ని బస్ ఎక్కించి బైటికి వచ్చిన ఆనందరావు "పీడవిరగడైంది" అనుకున్నాడు.

మల్లెపూలు కొనుక్కొని ఇంటికి వెళ్ళాడు. వేణ్నీళ్ళ స్నానంచేసి భోం చేసాడు.

ఆనందరావు మొహంలో కోరిక స్పష్టంగా తెలుస్తోంది. సుజాత మనసు ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది

ఆమె తెల్ల చీర కట్టుకుని తల దువ్వుకుని మల్లెపూలు పెట్టుకుంది;పిల్లాడికి పాలుపట్టి నిద్రపోగొట్టింది

ఆనందరావు భార్యరాక కోసం ఎదుర్చూస్తున్నాడు ఆమె కుర్చీలో కూర్చుని పుస్తకం తిరగేస్తోంది పిలిస్తే వెడదామనుకుంటోంది పిలవకుండా తనంతట తనే వస్తుందని అతను ఎదురుచూస్తున్నాడు

ఇద్దరి కళ్ళు కలుసుకున్నపుడు మాత్రం ఇద్దరూ చిన్నగా నవ్వుకుంటున్నారు.

గడియారం పది చూపిస్తోంది.

ఆనందరావు పత్తుగిలి పడుకుని మడిచిన కుడి చెయ్యిమీద తల ఆనించి సుజాత కేసి చూస్తున్నాడు

మొత్తం ప్రపంచంలోని ఆనందం తన ముందు కుప్పలా పోసినట్టుగా భావిస్తున్నాడు

ఎవరో తలుపు కొట్టారు

ఆనందరావు వెళ్ళి తలుపు తీశాడు ఎదురింటి భాస్కరం ఆనందరావు ఏవిటన్నట్టు చూశాడు

"మర్చిపోయారా గురూగారూ! ఈ వేళ మీ డ్యూటీ..." అన్నాడు

ఆనందరావు బిత్తరపోయాడు.

"మన వాళ్ళంతా వచ్చేశారు. బట్టలేసుకుని రండి" అని భాస్కరం వెళ్ళిపోయాడు

సిటీలో బందిపోటు దొంగల భయం పెరిగిందని అన్ని కాలనీల్లోను జనం జట్లు జట్లుగా రాత్రిళ్ళు కాపలా కాస్తున్నారు. వంతు ప్రకారం ప్రతి మూడో రోజు ఆనందరావుకి డ్యూటీ పడుతుంది. అతనా విషయమే మర్చిపోయాడు.

విషయం తెలిసిన సుజాత జాలిగా మొహం పెట్టింది గబగబా అసహనంగా బట్ట లేసుకుని 'తలుపేసుకో' అని పెళ్ళానికి చెప్పి-కర్ర, టార్చిలైటు చేత్తో పట్టుకుని ఇష్టంలేని డ్యూటీకి వెడుతున్న ముసలి కానిస్టేబుల్లా వెళ్ళిపోయాడు.

అర్ధరాత్రి రెండుగంటలకి అతని డ్యూటీ ముగిసింది మరో జట్టువాళ్ళని నిద్ర లేపి ఇంటికి తిరిగి వచ్చాడు.

నీరసంగా ఉంది కళ్లు మూసుకుపోతున్నాయి

పచ్చి బట్టలు మార్చుకుని కాళ్లు కడుక్కుని మంచం మీద వాలిపోయాడు

సుజాత వచ్చి "జరగండి" అని పక్కనే పడుకుంది అతనామె వైపు తిరిగి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు

ఆమె తల్లో మల్లెలు మాడిన వాసన వేస్తున్నాయి అతన్ని కోరిక తొంగదీసుకుంటోంది

'కేర్' మని చంటిపిల్లాడు లేచాడు.

సుజాత లేచి లైటువేసి పిల్లాణ్ని ఎత్తుకుంది వళ్లో పడుకో బెట్టుకుని జో కొట్టింది

అయినా వాడు ఏడుపు ఆపలేదు.

లేచి పాలు కలిపి తెచ్చి పట్టించింది.

ఏ చీమైనా కుట్టిందేమోనని చొక్కా తీసి పిల్లాడు వళ్ళంతా చూసింది-ఏమీ కనబళ్ళేదు.

ఆనందరావు వెళ్ళి పిల్లాణ్ని ఎత్తుకుని బైటికి తీసికెళ్ళి గాలిలో తిప్పాడు.

ఎంతసేపు తిప్పినా వాడు ఏడుపు ఆపలేదు




ఆనందరావుకి కోపం తారస్థాయినందు కుంది. పిల్లాణ్ని ఛెళ్లుమని ఓ దెబ్బ వేశాడు

వాడు గుక్కపట్టాడు.

"వాడికి కడుపు నొప్పి వచ్చి ఏడుస్తున్నాడేమో-వాణ్నెందుకు కొట్టారు?" అంది సుజాత బాధగా

"ప్రాణాలు తీస్తున్నాడు వెధవ! రోజూ ఇంతే నిద్ర పోనివ్వడు" అన్నాడు ఆనందరావు.

అది నిజం కాదని సుజాతకే కాదు ఆనందరావుకీ తెలుసు,

పిల్లాడు కాసేపు గుక్కపట్టి ఏడ్చి నిద్రపోయాడు, నిద్రపోయిన పిల్లాణ్ని పక్క మీద పడుకోపెట్టి సుజాత లైటు ఆర్పేసింది.

ఆనందరావుకి నిద్ర రావడంలేదు.

ఆమె మెల్లిగా ఆనందరావు పక్కన పడుకుంది కదలిక లేని ఆనందరావు మొహం తన వైపుకి తిప్పుకుంది.

అన్నిరోజుల, అన్నివారాల, అన్ని నెలల నిరీక్షణ ఫలించింది.

కాని...


సుజాతకి ఆనందరావు యాంత్రికంగా శవంలా ప్రవర్తించినట్టు అనిపించాడు.

ఆనందరావుకి సుజాత అలాగే అనిపించింది.

తెల్లగా తెల్లారిపోయింది

# గురు దక్షిణ

చింతా దీక్షితులు



**పందల కొద్ది** సంవత్సరముల బట్టి ఆ వంశములో చదువులేదు, వందలకొద్ది సంవత్సరములబట్టి ఆ వంశములో ఉన్నది కూలి పని, బానిసత్వానికి సరి సమానమైన కూలిపని, ఆ కూలి పనిలో విధేయతా, ఆ కూలిపనిలో దాగివున్న సంఘము మీద కోపమూ, ఆకూలిపనిలో స్వామి భక్తి, ఆ కూలి పనిలో ఒదిగి వున్న ముష్కరత్వమూ ఆ వంశములో వందలకొద్ది సంవత్సరములబట్టి జీర్ణమైనవి చదువుకు సంబంధించిన సంప్రదాయాలా వంశానికి తెలియవు.

అతడు ఆ వంశములో పుట్టాడు కుల క్రమాగతి వృత్తి కొంతకాలం సాగించాడు చదువుకొన్న వాళ్ళతో సహవాసంచేయడంవల్ల కాబోలు చదువుకుందామని బుద్ధి పుట్టింది అతనికి

ప్రయత్నించగా ప్రయత్నింగా అతనికి కూలి పని లేకుండా ఖాళీగా వున్న సమయంలో పాఠము చెప్పడమునకు ఒక విద్వాంసుడు ఒప్పుకున్నాడు.

కూలివాని తలలో విద్యా బీజములు వెద జల్లుతున్నాడు విద్వాంసుడు కొన్ని బీజములు మొలకెత్తడములేదు మొలకలు కొన్ని పాలిపోతున్నవి ఒకటి రెండు మొలకలు బలహీనంగా బతికి ఉన్నవి ఒకటి రెండు సంవత్సరములలో విద్య పరిపూర్ణ స్థితికి వచ్చింది నేర్చుకొన్న విద్యా పరిమితి వ్రాత, కూడిక ,తీసివేత లెక్కలు అతడు గురువు వద్ద సెలవు పుచ్చుకున్నాడు. "గురుదక్షిణ ఏమియ్యమని సెలవు" అన్నాడు శిష్యుడు

'ఇప్పుడు కాదు' అన్నాడు గురువు

చదువు, వ్రాత, లెక్కలు వచ్చుననే కారణం చేతను, పుట్టుకవల్ల కూలివాడనే కారణంవల్లను అతనికి ఉద్యోగం దొరికింది పోలీసు కానిస్టేబు ఉద్యోగం!

తన అధికారుల మెప్పు పొంది అతడు క్రమంగా వృద్ధిలోకి వస్తున్నాడు

అవి తొందర రోజులు. ప్రజలు దొర తనము వారిపై తిరగబడ్డ రోజులు. దొర తనమువారు ప్రజలకు ఏవిధంగానైనా

శక్తిచూపి బుద్ధిచెప్పవలెనని సంకల్పించు కొన్నారు దోషి, నిర్దోషి, తనవాడు, ఇతరుడు. సజ్జనుడు, దుర్జనుడు అనే విచక్షణము లేకుండా దొరతనము వారు తమ బలమును ప్రజలకు ప్రదర్శిస్తున్నారు

అతడు దొరతనమే తాననుకొని భక్తితో పనిచేస్తున్నాడు అతనికి కూడు గుడ్డ దొరతనమేగదా ఇస్తుంట! కూడు-అతని జీతము, గుడ్డ-వారిచ్చే లాగూ చొక్కా, టోపీ, తోలు పటకాలు, లాటి, తుపాకీ, తూటాలు, కూడు గుడ్డా ఇచ్చేవారి యెడల భక్తి కలిగిఉండడం సహజమనిఅతనిఊహ

విద్వాంసుడు ప్రజలలో ఒకడు

కూలివాడు దొరతనములో ఒకడు

గురువు ప్రజా పక్షము

శిష్యుడు స్వామి పక్షము

అతడు ప్రతిరోజూ చాకచక్యముతో తన లాటీ ప్రజల శరీరముమీద ప్రయోగించడం నేర్చుకున్నాడు మద్యపానముతో పని లేకుండానే అతడు నైపుణ్యమునో లాటీ ఉపయోగించగలడు ప్రతీరోజూ తన కూడు గుడ్డా సంగతి తలచుకుంటున్నాడు ప్రతిరోజూ తనను తన అధికారులు మెచ్చుకొని కూడు గుడ్డా వృద్ధి చేస్తారని అనుకొంటున్నాడు.

ఒకనాడు లాటీలు ప్రజల శరీరముమీద ఈగలవల్ల వాలుతున్నవి ప్రజల శరీరములువాటివల్లె ఉబ్బొంగుతున్నవి.అందరి లాటీల కంటే అతని లాటీ ఆడుతున్నది ఆ సమయాన అతడు ప్రజలలో తన గురువును చూశాడు అలవాటు చొప్పున తన లాటీ ఎత్తి గురువు శరీరము మీద వాల్చాడు గురువు చిరునవ్వు నవ్వి "ఈ రోజున నాకు గురు దక్షిణ ముట్టింది" అన్నాడు.

శిష్యుడు లాటి చేతులతో అతనికి నమస్కరించాడు యథాప్రకారం తన విద్యుక్తకార్యం చేస్తూ

• • •

కొన్నాళ్ళు గడిచింది

అతడు ప్రజలలో లాలూచీ అవుతున్నాడని అతని మీద కిట్టని వాళ్ళు సాటి ఉద్యోగులే అర్జీ ఇచ్చారు. పోలీసు అధికారి విచారణ చేసాడు

'నువ్వు రాజద్రోహికి నమస్కారంచేశావా?'

"అతడు రాజద్రోహి అయినా నాకు"

"అదంతావద్దు, నమస్కారం చేశావా?"

"రాజద్రోహిని కొట్టాను గురువుకు—"

"అనవసర ప్రసంగంవద్దు రాజద్రోహికి నమస్కరించావా! లేదా?"

"నమస్కరించాను కాని—"

"సరి నీవు వెళ్ళు"

అతనికి ఉద్యోగం పోయింది

కూడు గుడ్డా పోయింది

బాగా ఆలోచించి అతడు సలహా కోసం గురువు దగ్గరకు వెళ్ళాడు

గురువు "ఎందుకొచ్చావ్" అన్నాడు

"నా చదువు పూర్తి చేసుకోవడానికి" అన్నాడు శిష్యుడు.

"ఇంతవరకూ చదివినందువల్ల నీకు కలిగిన లాభం ఏమిటి"

"కూడూ గుడ్డా"

"ఆ లాభం నిలిచిందా"

"పోయింది"

"ఇప్పుడు ఏమి కావాలెమరి?"

"ఇంకా ఎక్కువ చదువురా"

"ఎందుకు?"

"కూడూ, గుడ్డా పోకుండా నిలిచేమార్గం

కోసం"
"కానీ"
శిష్యుడి చేతిలో పోతనగారి భాగవతం పెట్టి ప్రతీరోజూ చదువమన్నాడు గురువు. నెలదాటిన తారువాత రిమ్మన్నాడు.
నెల గడిచింది శిష్యుడు వచ్చాడు.
"ఏమి నేర్చుకొన్నావు?"
"వాచకం బాగా వచ్చింది"
"అంతేనా"
"కథ కొంత కొంత తెలుస్తోంది"
శిష్యుడు వెళ్ళి నెలపోయిన తరువాత మళ్ళీ వచ్చాడు.
"ఎందుకు చదువుతున్నావు?"
"కూడూ గుడ్డా కోసం"
కొన్ని నెలలపాటు శిష్యుడు భాగవతమే చదువుతున్నాడు ఎప్పటికైనా గురువును తృప్తి పరచాలని.
ఒక ఆ వృత్తి అయింది
విద్యకు పరమావధి కూడూ గుడ్డా కాదేమో అనుకున్నాడు శిష్యుడు
రెండవ ఆ వృత్తి అయింది.
విద్యకూ కూడు గుడ్డలకూ సంబంధం లేదేమోనని అనిపించింది శిష్యుడికి.
గురువు దగ్గరకి వెళ్ళాడు
"ఉద్యోగం పోయిందిగదా! నీకెలా గడుస్తోంది!"
"పుట్టుక ఇచ్చినవాడే పెడుతున్నాడు బాబయ్యా" అన్నాడు శిష్యుడు
"నీకు లోటు లేకుండా ఉంటుంది. ఉద్యోగం ఒకటిఖాళీగాఉంది వెడతావా?"
"నా కెందుకండీ? కాడెద్దులను పెట్టుకొని భాగవతం చదువుకుంటూ కాలక్షేపము చేస్తాను."
"విద్యకుపరమావధి ఇప్పుడు తెలిసిందా"
"చిత్తం!"
"ఏమిటి?"
"ధర్మం, మోక్షం?"
"సరే, వెళ్ళు"
"చిత్తం తమకు ఏమి గురుదక్షిణ ఇచ్చుకోమని సెలవు?"
"ఇప్పుడు కాదు" అన్నాడు గురువు.
రెండవమారు దేశంలో తొందర రోజులు వచ్చాయి పూర్వముకన్నా ఎక్కువగా దొరతనమువారు తమ శక్తి ప్రదర్శిస్తున్నారు. మళ్ళీ గురువు ప్రజాపక్షాన్ని నిలిచాడు
శిష్యుడు గురువుకు నీడ అయ్యాడు.
ఒకనాటి అల్లరిలో తన గురువును లాఠీలతో దొరతనపు సేవకులు కొట్టదలుచుకొన్నారు. శిష్యుడు గురువే ధర్మమని మనస్సులో అనుకొన్నాడు ఆ రోజున గురువు శరీరము మీద పడవలసిన దెబ్బలన్నీ శిష్యుడు దేహాన్ని అలంకరించాయి శిష్యుడు ఒళ్ళు తెలియక పడిపోయాడు. గురువు శిష్యునిపక్క కూచుని ఒళ్ళు నిమురుతున్నాడు.
గురువు చేయి తగిలిన కొంతసేపటికి శిష్యుడు కళ్లు తెరచి గురువు కేసి చూచాడు.
గురువు వంగి అతని చెవిలో "నిజమైన గురుదక్షిణ ఈ రోజున నాకు ముట్టింది అన్నాడు
శిష్యుడు చిరునవ్వు నవ్వి మళ్ళీ నీరసం వల్ల కళ్లు మూశాడు.